# చిత్రహింస

యస్.కె.యస్. రామానుజాచారి

వాన రాకడ—ప్రాణంపోకడ తెలియదంటారు పెద్దలు. తెలియకపోబట్టే గదా అనుకోకుండా వచ్చిన వాన అన్ని తికమకలతీ దాలితీసింది.

ఆఫీసులో పనిపూర్తి చేసుకుని ఇంటి మొహం పట్టేము—నేనూ, మా హెడ్ గుమాస్తాగారూ. మా ఇళ్ళు ఎదురెదురుగా ఉంటాయి.

సగందూరం వచ్చేసరికి ఉరుములు మెరుపులతో బ్రహ్మాండంగా వర్షం ప్రారంభించింది.

ఎన్నోసార్లు చూశాను. ఉరుములని మెరుపులని చూస్తే దీపాలకి భయమో. అసూయో ఉన్నట్టుండి నిస్తేజాలవుతాయి.

వేరే దారి తోచక దగ్గరలో ఉన్న సత్రం వసారాలోకి పోయి నిలపడ్డాము.

హెడ్‌గుమాస్తా గారు అసలే బక్కపలచని మనిషి. సుస్తీ చేసి సెలవు పెట్టి నాలుగైదు రోజుల క్రితమే డ్యూటీలో చేరేరు.

హెడ్‌గుమాస్తాగారు మితభాషి మాత్రమే కాక 'మితశ్రోత' కూడా. తాము ఎక్కువగా మాట్లాడరు. ఇతరులు మాట్లాడితే వినలేరు. రెండు దశాబ్దాలకి పైగా ఫైళ్ళలోనే జీవితం గడిపేశారేమో ఆయన ఆలోచనలు కూడా నిరంతరం ఆఫీసుకు సంబంధించినవిగానే ఉంటాయి. వారి రిమార్కులు "అల్పాక్షరాలలో అనల్పార్ధ రచనలు"

నిజమో, కల్పనోగాని, "రెండు మూడు పార్లు జ్ఞాపకం చేసినా చాకలి వెనకటి రేవులో వేసిన చొక్కా తీసుకుని రావే లేదండీ"అని వారి భార్య చెపితే—"డి. ఒ.—లెటరు రాస్తేసరి తిరుగు టపాలో వ్యవహారం తేలిపోతుంది"—అన్నారని చెప్పుకుంటూ ఉంటారు.

గుమాస్తాల చేత పని చేయించటంలో హెడ్‌గుమాస్తాగారు మంచి దిట్ట.

ఒకసారి ఉదయం నా ఎడమచేతి వేలికి తేలు కుట్టింది. ఆ రోజున సెలవు పెడతానంటే, 'కుట్టింది ఎడమచేతికి కదా! కుడి చేతితో వ్రాయవచ్చు. సెలవు పాడు చేసుకోకండి'—అని సలహా ఇచ్చారు.

విధి నిర్వహణలో అంతటి అప్రమత్తులు గనుకనే అస్మదాదులకి అంత గౌరవం ఆయనంటే.

జల్లు వసారాలోకి పడుతూంది. "లోపలికి పోతే బాగుంటుందేమో, హెడ్‌గుమాస్తా గారూ!" అన్నాను.

"ఎవరు బాబూ నిలబడింది—హెడ్ గుమాస్తాగారా లోపలికి దయ చెయ్యండి" అని పిలుపు వినిపించింది కుడివైపు గదిలోనించి.

ఆహ్వానించినవారు క్రితంరోజున ఆఫీసుకు వచ్చి హెడ్‌గుమాస్తా గారిని కలుసుకున్నవారే. తాయెత్తులు తయారు చేసి విక్రయిస్తారట ఆయన. భారతదేశమంతా తిరుగుతూ ఉంటారుట.

లోపలి కెళ్ళి తుంగ చాప మీద కూర్చున్నాము. కోడిగుడ్డు దీపం వెలుగుతూంది గదిలో.

"ప్రకృతిశక్తులని అదుపులో పెట్టే శక్తిసామర్థ్యాలు ఆ పరమాత్మకి ఒక్కడికే ఉన్నాయి. ఈ అకాల వర్షమేమిటి చెప్పండి" అన్నారు తాయెత్తుల గురువుగారు.

హెడ్‌గుమాస్తా గారు ఏదో ఆలోచనలో ఉన్నారు.

"ఈ శలభాన్ని చూశారా, హెడ్ గుమాస్తాగారూ"— దీపం చుట్టూ ఎగురుతూన్న మిడతని చూస్తూ అన్నారు గురువుగారు. "దీపకాంతి—శలభభ్రమణం—అంతా మాయ. మరో క్షణానికి ఏమి జరుగుతుందో శలభానికేమిటి— మానవుడికే తెలియదు గదా! మానవ కల్యాణం కోసమే మంత్రపూతమైన ఈ తాయెత్తులు తయారు చేశాను."

గురువుగారి 'మానవ కల్యాణం' వినేసరికి, మాకు సరుకులమ్మే దుకాణదారు జ్ఞాపకమొచ్చాడు. అతను అంటూ ఉంటాడు, "బాబూ, జనానికి సేవ చెయ్య

(48 వ పేజీ చూడండి)



# చిత్రహింస

(12వ పేజీ తరువాయి)

టానికే నేను పుట్టేను. ఉదయం ఏడు గంటల నించీ, రాత్రి పదిగంటల వరకూ, ఉప్పు కానీయండి, మిర్చి కానీయండి, నూనె కానీయండి ఎవరొచ్చి ఏది కావాలన్నా జాతి, మత విచక్షణ లేకుండా అందరికీ ఆదరణతో అందచేస్తూ ఉండటమే నా పనండి'' అని.

మానవ కల్యాణం ఒకరి ధ్యేయమైతే, మానవ సేవ మరొకరి లక్ష్యం.

గురువుగారు సూటుకేసు లోంచి మూడు రకాల తాయెత్తులు తీసి వాటి ఖరీదులు, మూడు రూపాయలు, ఆరు రూపాయలు, పది రూపాయలు అని చెప్పేరు.

హెడ్ గుమాస్తాగారినించి రెస్పాన్సు లేకపోవటం గురువుగారికి నిరుత్సాహంగానే ఉంది.

మామూలు గుమాస్తాననేమో నా అస్తిత్వమే గుర్తించినట్టు లేదు గురువులు. అయినా నేనే కల్పించుకుని "అయ్యా! గురువుగారూ! ధరలలో తేడాలు చెపుతున్నారు. మహిమలలో కూడా తేడాలు ఉంటాయా?'' అన్నాను.

"ఎంత చచ్చు ప్రశ్న వేశావురా చవట తండ్రీ'' అన్నట్టుగా గురువులవారు నాకేసి చూసి, "అది కాదయ్యా, ఉపయోగించిన లోహాన్ని పట్టి ధర మారుతుంది. అంతేగాని మహత్తులో తేడా ఉండదు'' అన్నారు.

ముళ్ల మీద కూచున్నట్టుగా ఉన్నట్టుంది హెడ్‌గుమాస్తాగారికి.

మంత్ర శాస్త్రానికి మూలాధారం ప్రణవం. ప్రణవానికి అపారశక్తి ఉంది. "ఓం'' అని గుక్కపట్టి శబ్దం చేసారు తాయెత్తులవారు. "ఘంటికా నాదంలా వినిపించి తమలో అనిర్వచనీయమైన అనుభూతిని కలిగించలేదా హెడ్‌గుమాస్తాగారూ'' అని అడిగేరు నోరూ, కళ్లూ మామూలు స్థితికి తెచ్చుకుని.

హెడ్‌గుమాస్తాగారు అనిర్వచనీయమైన అనుభూతిని పొందినట్టే కనిపించి, "వర్షం తగ్గిందేమో చూడవయ్యా, ఆనందంగారూ'' అన్నారు నాకేసి చూసి.

"అబ్బే! ఇంకా జోరుగానే పడుతూందండీ. నా దగ్గర గొడుగు ఉండదు. నేనసలు గొడుగు ఉపయోగించను. భగవదంకితమైన ఈ జటాజూటానికీ, భగవత్సృష్టి అయిన ఆకాశానికీ మధ్యగా అడ్డంకిగా గొడుగు ఉంచటం అపచారంగా భావిస్తాను.'' అన్నారు గురువుగారు.

హెడ్‌గుమాస్తాగారి కంఠంలో నించి వచ్చిన స్వరం, మూలుగో, 'ఊఁ' అనటమో తెలుసుకోలేకపోయాను.

"చాలా బలహీనంగా ఉన్నారు. ఆసనాలు వేయకూడదుటండీ. ఈ ఆసనాల విషయంలో మనకన్న ఉత్తరాదివారికి శ్రద్ధ ఎక్కువ. విధిగా లంగోటీ ధరిస్తారు. శీర్షాసనం శారీరకముగా, మానసికముగా కూడా పుష్టినిస్తుంది. వేసే పద్ధతి మీక్కిప్పుడే స్థూలముగా చూపుతాను'' అని వేయబోయారు గురువుగారు.

శీర్షాసనం చూద్దామని నాకూ ఉంది. కాని హెడ్‌గుమాస్తాగారు వెయ్యనిస్తేగా!

"బాబూ శ్రమపడకండి మరో మారు చూస్తానులెండి'' అన్నారాయన.

"అలాగే ఇంకో వారంరోజుల వరకు నేను ఈ ఊళ్లోనే ఉంటానులెండి. ఇక్కడినించి కటక్ వెళ్లాలనుకుంటున్నాను. ఒక ఆదివారం తమరు దయచేస్తే....అన్నట్టు ఇవాళ శనివారం కాదూ!''

"ఈ వర్షం తెల్లవారూ ఇలాగే ఉండేట్టుందే'' అన్నారు హెడ్‌గుమాస్తాగారు.

తాయెత్తు ధరిస్తే మీ ఆరోగ్యం చక్కబడుతుంది. వీటిని గురించి యోగ్యతా పత్రాలు కూడా చాలా ఉన్నాయి నా దగ్గర. తమబోటి వారు ఇచ్చినవి. — అంటూ, 23 × 10 సెంటిమీటర్ల కవరు పెట్టెలో నించి తీసి, దానిలోంచి కాగితాల దొంతర బయటకు లాగేరు.

"ఇది చదవండి?'' అని ఒక కాగితం హెడ్‌గుమాస్తాగారికి ఇవ్వబోయారు.

"నా కళ్లజోడు ఆఫీసులో ఉందండీ. నువ్వు చూడవయ్యా, ఆనందం'' అన్నారు.

"పోనీ నాది ఆనుతుందేమో చూడండి'' అన్నారు గురువుగారు. హెడ్‌గుమాస్తాగారే స్వయంగా చదవాలని వారి అభిలాష.

"లాభం లేదండీ'' పాము నోట్లో ఇరుక్కున్న కప్ప అరిచినట్టుగా ఉంది ఆయన గొంతు.

వాన తగ్గిందేమో చూద్దామని వసారాలోకి వెళ్లేను. ప్రాణాయామం—భూమి మీద నుండి మూడునాలుగు అడుగుల పైకి లేవటం — హంస, ఎగిరిపోవటం— సత్తు — చక్రాలు — ఏవేవో మాటలు గురువుగారు సెలవిస్తున్నారు.

"ఈ వర్షం ఇప్పుడప్పుడే తగ్గేట్టు లేదు. వస్తానండీ'' అని సెలవు తీసుకుని "పదవయ్యా, పోదాం'' అంటూ వసారాలోకి వచ్చి గబగబ రోడ్డు మీదకు చేరుకున్నారు హెడ్‌గుమాస్తాగారు. ఆయన నడక వేగం చూసి నేను ఆశ్చర్యపోయాను.

"రేపు తప్పక దయ చేయండి. ఆసనాలు చూద్దురుగాని. తాయెత్తులను గురించిన వివరాలు కూడా వివరంగా మనవి చేస్తాను'' అంటున్నారు వెనకనించి గురువుగారు.

నీళ్లలో నడిచిపోతున్నాము. పెద్దపెద్ద చినుకులే పడుతున్నాయి.

తలకాయ తడిస్తే నాకు రొంప పడుతుంది. హెడ్‌గుమాస్తాగారిది బట్టతల గనుక చినుకు నిలవదు. జారిపోతుంది.

నా చొక్కా విప్పి నెత్తి మీద వేసుకున్నాను.

చిన్నప్పుడు బళ్లో చదువుకొనేటప్పుడు బడి వదలిన తర్వాత వర్షం వస్తే, చొక్కా భుజం భాగం నెత్తి మీదకు లాక్కొని, పలక, సుమతీ శతకం, గణితబోధిని, వాచకం, చొక్కా ముందు పొరలో దాచి పరిగెత్తే వాళ్లం ఇంటికి.

మధ్య మధ్య వెనక్కి చూస్తూ హెడ్ గుమాస్తాగారు ముందు నడుస్తున్నారు మౌనంగా.

ఎలాగో కొంపలు చేరుకున్నాము

"పూర్తిగా తడిసిపోయారే. తల తుడుచుకోండి'' అంటూ తువ్వాల చేతికి అందించింది మా శ్రీమతి.

"సరేగాని దేవిగారూ, మీ తాతయ్యగారు ఆసనాలు వేస్తూ ఉంటారు గదా— పద్మాసనం వేసుకుని, భూమి మీదనించి పైకి లేవగలరా!'' అన్నాను.

అర్ధాంగికి అర్థమయినట్టు లేదు.

"మా తాతయ్య లేవటం మాట అలా ఉంచండి. ఆలస్యం చేస్తే చంటివాడు లేస్తాడు. ఇంతకుముందే నిద్రపుచ్చాను; భోజనానికి లేవండి. వాడు లేచాడంటే భోజనం ముందునుంచి అర్ధాకలితో మీరు లేవవలసి వస్తుంది'' అంది ఆవిడగారు.

నిజమే మరి. ఆకలి లేకుండా చేసే మహిమ తాయెత్తు కున్నదేమో గురువుగారిని కనుక్కోవాలి, ఈ సారి హెడ్ గుమాస్తాగారితో వెళ్లినప్పుడు. అంతవరకు శ్రీమతి సలహా పాటించక తప్పదు. ●